# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం, 20 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2 PM


## ఛ్చ్.. మళ్లీ నిరాశే..



న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ప్రజాస్వరం): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణను దేశ అత్యున్నత న్యాయస్థానం వాయిదా వేసింది. కవిత బెయిల్ పిటిషన్‌కు సీబీఐ అధికారులు కౌంటర్ దాఖలు చేయగా.. శుక్రవారం లోపు కౌంటర్ దాఖలు చేసేందుకు ఈడీకి 23వ తేదీ వరకూ సమయం ఇచ్చింది. వచ్చే మంగళవారం(ఆగస్టు 27) బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. కాగా, ముందుగా బెయిల్ ఇవ్వాలని కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. ఆ కోర్టు నిరాకరించింది. దాన్ని సవాలు చేస్తూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇవాళ విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది. కాగా, ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో గత మార్చి 15న కవితను ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాలతో నేరుగా ఢిల్లీలోని తీహార్ జైలుకు ఆమెను తరలించారు.



# కుండపోత..

## హైదరాబాద్‌లో భారీ వర్షం

### తెల్లవారుజామున దంచికొట్టిన వాన
### రెండు గంటలపాటు బీభత్సం
### జలమయమైన లోతట్టు ప్రాంతాలు
### భయపెట్టిన ఉరుములు, పిడుగులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ప్రజాస్వరం) : నగరంలో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రధాన మార్గాలు, కాలనీలన్నీ జలమయమయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్, అల్కాపురి ప్రాంతాల్లో భారీ వర్షం పడుతోంది. అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఖైరతాబాద్, నాంపల్లి, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, అబిడ్స్, నాంపల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట, బహదూర్ పల్లి, సూరారం, సుచిత్ర, గుండ్ల పోచంపల్లి, పేట్ బషీరాబాద్, జీడిమెట్లలో కుండపోత వర్షం కురిసింది. వనస్థలిపురం, బీఎన్ రెడ్డి నగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఖైరతాబాద్ ప్రధాన మార్గంలో మోకాలిలోతు వరకు నీరు చేరింది. ముసారాంబాగ్ వద్ద మూసీ నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. ముషీరాబాద్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంనగర్, పార్సీగుట్ట, బౌద్ధ నగర్, గంగపుత్ర కాలనీల్లోకి భారీగా వరదనీరు చేరింది. వర్షపు నీటిలో గుర్తు తెలియని వ్యక్తి కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. కొన్నిచోట్ల కార్లు కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. మరోవైపు వాతావరణశాఖ హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఏదైనా సమస్య తలెత్తితే 040-21111111, 9000113667 నంబర్లకు కాల్ చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు. పలుచోట్ల జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. వర్షం ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో భాగ్యనగరం అంధకారంలో నెలకొంది. వర్షం ధాటికి భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. వర్షపు నీరు మోకాళ్ల లోతులో నిలిచిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ మళ్లించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.







## దమ్ముంటే టచ్ చేయండి..

### బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ వార్నింగ్



హైదరాబాద్, ఆగస్టు 20 (ప్రజాస్వరం): బీఆర్ఎస్ నేతల విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సోమాజీగూడలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి సీఎం రేవంత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారని.. 'చేతనైనే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అధికారం పోయినా కొందరికి అహంకారం తగ్గడం లేదని మండిపడ్డారు. సచివాలయం ఎదుట కేసీఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలనే ఆలోచన రాని వాళ్లకు ఇవాళ ప్రశ్నించే నైతిక లేదని అన్నారు. వచ్చే డిసెంబర్ 9వ తేదీలోపు సచివాయంలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని కీలక ప్రకటన చేశారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశాక.. ఏ రోజు తొలగిస్తారో చెబితే తాము కూడా వస్తామని అన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. ఇవాళే ప్రారంభం చేయాలని ముందుగా నిర్ణయం తీసుకున్నాం.. కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అని అన్నారు. ఆయన విగ్రహం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని వెల్లడించారు. అధికారం కోల్పోయేసరికి బీఆర్ఎస్ నేతలు విచక్షణ మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## ఆ చెత్తాచెదారాన్ని తొలగిస్తాం

### బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ వార్నింగ్



హైదరాబాద్, ఆగస్టు 20 (ప్రజాస్వరం): సోమాజిగూడలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చేసిన సీఎం వ్యాఖ్యలపై ట్విటర్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. 'నా మాటలు గుర్తు పెట్టుకో సీఎం రేవంత్ రెడ్డి.. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్త చెత్త చెదారాన్ని.. తాము మళ్లీ కార్యాలయంలోకి వచ్చిన రోజునే తొలగిస్తాం. అని రాసుకొచ్చారు. అలాగే నీలాంటి ఢిల్లీ గులాం తెలంగాణ ఆత్మగౌరవాన్ని, గర్వాన్ని అర్థం చేసుకోగలడని ఆశించలేం, బడి పిల్లల ముందు నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం మీ నిజమైన ఆలోచన చూపుతుంది. మీరు ఈ మానసిక వ్యాధి నుండి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను'.. అని తన ట్వీట్ కేటీఆర్ రాసుకొచ్చారు.

## కలెక్టర్లకు మంత్రి కీలక సూచన

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్ష సూచన, స్థానిక పరిస్థితులను బట్టి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలన్నారు.

## నిండుకుండలా హుస్సేన్‌సాగర్..



రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు హైదరాబాద్ నగరంలోని అన్ని ప్రధాన దారులు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, అమీర్ పేట, బేగంపేట, ఎస్ ఆర్ నగర్ ఖైరతాబాద్ ప్రాంతంలో అతి భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో భారీగా వరద వస్తుండటంతో హుస్సేన్ సాగర్ నిండు కుండలా మారిపోయింది. గంట గంటకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకొవాలని కమిషనర్ బల్దీయా అధికారులకు సూచించారు. కాగా ఎగువన కురిసన వర్షం కారణంగా ట్యాంక్ బండ్‌కు ఇన్ ఫ్లో 1850 క్యూసెక్కులు వస్తుండగా.. 1600 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

## 'చరిత్ర తెలుసుకుని మాట్లాడు..

హైదరాబాద్, ఆగస్టు 20 (ప్రజాస్వరం): హైదరాబాద్ ఐటీ రంగానికి దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పంజాగుట్టలోని రాజీవ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి పాల్గొని మాట్లాడారు. దేశంలో రాజీవ్ కంప్యూటర్ యుగాన్ని సృష్టించారని, ప్రతి పల్లెకు మంచి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో డ్రింకింగ్ వాటర్ టెక్నాలజీ మిషన్ తీసుకువచ్చింది, యువత దేశ పరిపాలనలో భాగస్వామ్యం కావాలని 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిందే రాజీవ్ గాంధీ అన్నారు. పారిశ్రామిక విప్లవాన్ని మిస్ చేసుకున్నామని కానీ కంప్యూటర్ విప్లవాన్ని మిస్ చేసుకోకూడదనే ఉద్దేశంతో ఆనాడు ప్రధాన మంత్రి హోదాలో రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు దేశంలో ఐటీ సెక్టార్ కు పునాదులు వేశారన్నారు. కొంత మంది గత చరిత్ర మర్చిపోయి మాట్లాడతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు.